క్లుప్తంగా

ఘనంగా ఉరుసు ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో జహురుద్దీన్‌బాబా దివ్య సమాధి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మెయిన్ బజారులోని సయ్యద్‌షా హుసేన్‌వల్లి దర్గాలో జహరుద్దీన్ బాబా ఉరుసు ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా భక్తులు బాబాదివ్య సమాధికి పూల దుప్పటి సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. ఫకీర్ల మేళతాళాలతో భక్తి గీతాలు ఆలపించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు ముక్తియార్, పీఠాధిపతి సయ్యద్ ముబినుద్దీన్, జహురుద్దీన్ బాబా కుటుంబీకులు, స్వర్ణకారుడు షేక్‌షబ్బీర్ హుసేన్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కలసపాడు : మండల పరిధి పాతరామాపురం ఫీడర్‌లోని పాతరామాపురం, అక్కివారిపల్లె, ముసల్‌రెడ్డిపల్లె, పుల్లారెడ్డిపల్లె గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ రమేష్ తెలిపారు. ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

మైదుకూరు డీఎస్పీగా రాజేంద్ర ప్రసాద్



కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు డీఎస్పీగా కడప ఇంటలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తున్న జి. రాజేంద్ర ప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులను జారీ చేశారు. 1995 బ్యాచ్‌కు చెందిన ఈయన వైఎస్ఆర్ జిల్లాలోనే ఎస్ఐగా, సీఐగా పనిచేశారు. 2008లో సీఐగా, 2023 డిసెంబర్ 23న డీఎస్పీగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం కడప ఇంటలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తూ మైదుకూరు డీఎస్పీగా బదిలీ అయ్యారు.

రేపు వెల్లాలకు పాదయాత్ర

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాత మార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి శ్రావణమాస మొదటి శనివారం సందర్భంగా వెల్లాల సంజీవరాయస్వామి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు శ్రీరామ భక్తబృందం వారు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజాము 5 గంటలకు ఈ పాదయాత్ర ప్రారంభమవుతుందని వారు పేర్కొన్నారు. పాదయాత్రలో పాల్గొనే భక్తులకు దారిమధ్యలో అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశామన్నారు. పాదయాత్రలో పాల్గొనే భక్తులు 8341616005 నంబరుకు సంప్రదించాలని కోరారు.

స్టీల్ ప్లాంట్ సాధనకు ఉద్యమం



నినాదాలు చేస్తున్న స్టీల్ ప్లాంట్ యునైటెడ్ ఫోరం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : జిల్లాలో స్టీల్ ప్లాంటు సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నట్లు స్టీల్ ప్లాంట్ యునైటెడ్ ఫోరం కన్వీనర్ ఖలందర్ పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ ఆవశ్యకతను తెలియజేస్తూ పలు ప్రాంతాల్లోని ప్రజలకు ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం మొదలు పెట్టడం నుంచి పూర్తి చేసే వరకు గాంధేయ మార్గంలో ఉద్యమం కొనసాగిస్తామన్నారు. ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు దళిత సంఘం నాయకుడు యల్లయ్య మాదిగ, హరిత, వివిధ దళిత, ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్య మృతి తీరని లోటు

బద్వేలు అర్బన్ : పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతి సీపీఎంకు తీరని లోటని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి కె.శ్రీను పేర్కొన్నారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు చిన్ని, నాగార్జున, ఆంజనేయులు, బాలస్వామి, సుబ్బరాయుడు, సుబ్బయ్య, అనంతమ్మ, మోక్షమ్మ పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

పెద్దముడియం : ఖరీఫ్‌లో సాగుచేసిన ప్రతి పంటకు పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి అరుణ తెలిపారు. గురువారం ఆమె మండలంలోని జంగాలపల్లెలో వ్యవసాయ శాఖ సిబ్బంది చేస్తున్న ఇ-క్రాప్ పంట నమోదును ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడారు.

ప్రతిష్టాత్మకంగా ఎస్ఎంసీ ఎన్నికలు

పాఠశాలల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలన్న ఉద్దేశంతో పాఠశాలల యాజమాన్య కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఎన్నికలు గురువారం ప్రతిష్టాత్మకంగా జరిగాయి. చాలా ప్రాంతాల్లో ఏకగ్రీవం అయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో ఎన్నికలు జరగగా, మరికొన్ని చోట్ల వాయిదా పడ్డాయి. ప్రొద్దుటూరు క్లస్టర్ పరిధి బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ఈ ఎన్నికలు నిర్వహించారు.

- పాఠశాలల నిర్వహణ కోసం యాజమాన్య కమిటీలు
- చాలా ప్రాంతాల్లో ఏకగ్రీవం
- కొన్ని చోట్ల వాయిదా



కలసపాడు : ఎస్ఎంసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న తులసి, సభ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పాఠశాలల నిర్వహణ కోసం గురువారం నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రొద్దుటూరు మండలంలో ప్రశాంతంగా జరిగాయి. కొన్ని పాఠశాలల్లో ఎన్నికలు జరగగా, మరికొన్ని పాఠశాలల్లో ఏకగ్రీవమయ్యాయి. ఎస్‌వీవీ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. మండలంలోని 110 పాఠశాలల్లో దాదాపు 25 పాఠశాలల్లో ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. ఐదారు పాఠశాలల్లో తీవ్ర పోటీ నెలకొనగా మిగిలిన పాఠశాలల్లో నామమాత్రపు పోటీ జరిగింది. ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఏకగ్రీవమైంది. చైర్మన్‌గా సుజాత, వైస్ చైర్మన్‌గా వెంకటలక్ష్మి ఎన్నికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గురప్ప తెలిపారు. రామేశ్వరం ఎస్సీసీఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో చైర్మన్ స్థానానికి నలుగురు పోటీ పడగా వి.జ్యోతి చైర్మన్‌గా గెలిచారు. అలాగే వైస్ చైర్మన్‌గా ఎం.సుధాకర్ ఏకగ్రీవమైనట్లు ప్రధానోపాధ్యాయుడు సత్యబాబు తెలిపారు. అసిస్టెంట్ సీఎంఓ దశరథరామిరెడ్డి, అసిస్టెంట్ ఏఎంఓ రామాంజనేయరెడ్డి, ఎంఈఓ సావిత్రమ్మ చెన్నంరాజుపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలతోపాటు మరికొన్ని పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణను పరిశీలించారు. హోమస్‌పేట ప్రాథమిక పాఠశాల చైర్మన్ డి.సునీత, వైస్‌చైర్మన్ ఎస్‌కే. రేష్మ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ప్రధానోపాధ్యాయుడు రవీంద్రుడు తెలిపారు.

బద్వేలు అర్బన్ : మండలంలో 65 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా బంకపాలెం, తిరువెంగళాపురం ఎయిడెడ్ పాఠశాలల కమిటీ ఎన్నికలు మినహా మిగిలిన 63 పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఆయా పాఠశాలల్లో నిర్వహించిన ఎన్నికలను ఇన్‌చార్జి ఎంఈఓ చెన్నయ్యతోపాటు ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించారు. జిల్లాలోనే అత్యధిక మంది విద్యార్థులు ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎన్నికలు కూడా ప్రశాంతంగా ముగిశాయి. నూతనంగా ఎన్నికైన పాఠశాలల యాజమాన్య కమిటీ సభ్యులతో ప్రధానోపాధ్యాయులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంఈఓ చెన్నయ్య మాట్లాడుతూ పాఠశాలల యాజమాన్య కమిటీ సభ్యులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

కలసపాడు : మండలంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ఎంఈఓ మస్తాన్‌వలి తెలిపారు. 40 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయని, కొండపేట, పుల్లారెడ్డిపల్లె గ్రామాల్లో కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడ్డాయని ఆయన పేర్కొన్నారు. ఎగువరామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారురాలు పేగిరెడ్డి తులసి చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అన్ని పాఠశాలల్లో ఎస్ఎంసీ చైర్మన్ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

కాశినాయన : మండలంలోని 43 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ నిర్మల తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బద్వేలు అర్బన్ : పాఠశాలల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేయనున్న పాఠశాల యాజమాన్య కమిటీకి గురువారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 65 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా బంకపాలెం, తిరువెంగళాపురం ఎయిడెడ్ పాఠశాలల కమిటీ ఎన్నికలు మినహా మిగిలిన 63 పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఆయా పాఠశాలల్లో నిర్వహించిన ఎన్నికలను ఇన్‌చార్జి ఎంఈఓ చెన్నయ్యతో పాటు ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించారు. జిల్లాలోనే అత్యధిక మంది విద్యార్థులు ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎన్నికలు కూడా ప్రశాంతంగా ముగిశాయి. నూతనంగా ఎన్నికైన పాఠశాలల యాజమాన్య కమిటీ సభ్యులతో ప్రధానోపాధ్యాయులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంఈఓ చెన్నయ్య మాట్లాడుతూ పాఠశాలల యాజమాన్య కమిటీ సభ్యులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

కలసపాడు : మండలంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ఎంఈఓ మస్తాన్‌వలి తెలిపారు. 40 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయని, కొండపేట, పుల్లారెడ్డిపల్లె గ్రామాల్లో కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడ్డాయని ఆయన పేర్కొన్నారు. ఎగువరామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారురాలు పేగిరెడ్డి తులసి చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అన్ని పాఠశాలల్లో ఎస్ఎంసీ చైర్మన్ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

కాశినాయన : మండలంలోని 43 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ నిర్మల తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రాజుపాళెం : మండలంలోని 28 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత, 8 జెడ్పీహెచ్ఎస్, వెల్లాలలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో పాఠశాలల కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికలను ఎంఈఓ-2 రామిస్వామిరెడ్డి పరిశీలించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పాఠశాలలో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఎక్కడ ఎటువంటి గొడవలు జరగకుండా ఎస్ఐ పి.తులసి నాగప్రసాద్ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

దువ్వూరు : మండలంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 56 పాఠశాలల్లో ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లకు ఎన్నికలు జరిగాయి. ఇందులో 42 మండల పరిషత్ పాఠశాలలు, ఆరు అప్పర్ ప్రైమరీ పాఠశాలలు, ఏడు జిల్లా పరిషత్ పాఠశాలలు, ఒక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ల పదవీకాలం రెండేళ్లు ఉంటుందని ఎంఈఓ భాస్కర్ తెలిపారు. ఎన్నికైన వారు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి, పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అన్ని పాఠశాలల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దువ్వూరు ఎస్ఐ శ్రీనివాసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

చాపాడు : మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 62 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వీటిలో 60 పాఠశాలల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎన్నికలు పూర్తయినట్లు ఎంఈఓ రవిశంకర్ తెలిపారు. బసిరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు ఎన్నిక నిర్వహించకపోవటంతో నోటీసు జారీ చేశామని, రేపల్లె గ్రామంలో కోరం లేకపోవటంతో ఎన్నికలు వాయిదా వేశామన్నారు. 60 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయన్నారు. చాపాడు హైస్కూల్‌లో మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా బత్తల ఆదిలక్ష్మీ, వైస్ చైర్మన్‌గా రాముడు, అన్నవరం హైస్కూల్ చైర్మన్‌గా మౌనిక, వైస్ చైర్మన్‌గా హరినాథ్‌రెడ్డి, మడూరులో షబానా, లక్ష్మీపేటలో గుర్రప్ప, నెర్రవాడలో లెక్కల ఐశ్వర్య, నెర్రవాడలో ఈశ్వరమ్మ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మండల కేంద్రమైన చాపాడులో టీడీపీ నాయకులు బయపురెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మధు, కిరణ్ పాల్గొన్నారు.

బి.కోడూరు : మండలంలో మొత్తం 38 పాఠశాలలు ఉండగా.. సగిలేరు గురుకుల పాఠశాల, మేకవారి పల్లె ప్రాథమిక పాఠశాలలు మినహా 36 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. ఎంఈఓ ఎం.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.

రామాపురంలో పోటాపోటీగా..

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని రామాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా జరిగాయి. ఒకానొక దశలో ఈ ఎన్నికలను నిలుపుదల చేయాలని టీడీపీ నేతలు ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఉపాధ్యాయులు నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా పత్తూరు ఓబన్న, వైస్ చైర్‌పర్సన్‌గా సత్యవతిని ఎన్నుకున్నారు. అందరి సహకారంతో పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని చైర్మన్, వైస్ చైర్మన్ తెలిపారు. నిధులు సక్రమంగా వినియోగిస్తామని వారు పేర్కొన్నారు.



ఓబన్న, ఎస్ఎంసీ చైర్మన్, రామాపురం



సత్యవతి వైస్ చైర్‌పర్సన్

పశువులకు గర్భకోశ వ్యాధులపై వైద్యశిబిరం

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని తెలుగు గంగ కాలనీ దగ్గర ఉన్న కొత్త బస్వాపురం గ్రామంలో గురువారం పశువులకు గర్భకోశ వ్యాధులపై పశువైద్య అధికారులు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 36 దూడలకు నట్టల నివారణ మందు, 18 పశువులకు వైద్యపరీక్షలు, 3 పశువులకు ఎదసూదులు, 38 పశువులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు, 82 జీవాలకు సాధారణ చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా బి.మఠం పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు కె.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వానాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై రైతులకు తెలియజేయడంతోపాటు అందుకు తగ్గట్టుగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు నిత్యానంద్, లక్ష్మినరసయ్య, శివరామిరెడ్డి, పశుసంవర్ధక సహాయకులు, గోపాల మిత్రులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



దూడకు నట్టల నివారణ మందు తాపుతున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

తపాలా జీవిత బీమా ఏజెంట్ల నియామకం

ప్రొద్దుటూరు : తపాలా శాఖలో భాగమైన తపాలా జీవిత బీమా డైరెక్ట్ ఏజెంట్లుగా నియమించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రొద్దుటూరు డివిజన్ తపాలా సూపరింటెండెంట్ జి.కిరణ్ తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 16వ తేదీన ఉదయం 10 గంటలకు తమ కార్యాలయంలో హాజరు కావాలని ఆయన కోరారు. 10వ తరగతి చదివి 18 నుంచి 50 ఏళ్లలోపు వయసు ఉన్న వారు ఏజెంట్ల నియామకానికి అర్హులని తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లు, రిటైర్డు స్కూల్ టీచర్లు, మాజీ సైనికులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు, ఇతర ఇన్సూరెన్స్ కంపెనీలలో పని చేసేవారు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఎంపికైన అభ్యర్థులు రూ.5 వేలు సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలోని డెవలప్‌మెంట్ ఆఫీసర్ సత్యనారాయణను సంప్రదించాలని కోరారు.

అన్నదానం

బద్వేలు అర్బన్ : స్థానిక తెలుగుగంగ కాలనీ రోడ్డులోని నిరాశ్రయుల వసతిగృహంలో ఇన్‌చార్జి ఆర్డీఓ చంద్రమోహన్ గురువారం అన్నదానం చేశారు. ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది జుటూరుసుదర్శన్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొలుత ఆశ్రమంలోని వృద్ధులతో మాట్లాడి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలోని వృద్ధులకు పెన్షన్ సమస్యలు ఉన్నా, ఆధార్, రేషన్‌కార్డు వంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని వసతిగృహం నిర్వాహకులను కోరారు. అనంతరం వృద్ధులకు అన్నదానంతోపాటు పండ్లు అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు రవికుమార్, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేవీ రమణారెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం

ప్రొద్దుటూరు : గోపీకృష్ణ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కేవీ రమణారెడ్డి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. కేవీ రమణారెడ్డి తృతీయ వర్ధంతి సందర్భంగా గురువారం దొరసానిపల్లె గోపీకృష్ణ హైస్కూల్‌లో 500 మంది పేదలకు నిత్యావసర వస్తువులు, మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శశిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ కేవీ రమణారెడ్డి పేదలకు అండగా ఉండేవారన్నారు. ఆయన బాటలోనే ఆయన కుమారులు కృష్ణ ప్రదీప్‌రెడ్డి, సందీప్‌రెడ్డి పేదలకు సేవ చేయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అమ్మ ఒక చెట్టు అని ప్రధాని మోదీ ఇచ్చిన నినాదంతో మొక్కలు నాటడం జరిగిందని శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ పర్లపాడు గౌరీశంకర్, రవి, గురు, కొండయ్య, విక్రాంత్‌తో పాటు ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.



నిత్యావసర వస్తువులు, మొక్క అందిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, శశిభూషణ్‌రెడ్డి

ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు

ప్రొద్దుటూరు : ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చునని ఉద్యానశాఖ అధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రేగుళ్లపల్లె గ్రామంలో ఉద్యానశాఖ, సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో సాగు చేసిన ఆయిల్ పామ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ఎంఈఓటీపీ పథకం ద్వారా ఆయిల్ సాగుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రాయితీలను ప్రకటించిందని తెలిపారు. మొక్కల పెంపకం కోసం దేశవాలి రకానికి హెక్టారుకు రూ.20 వేలు, విదేశీ రకానికి రూ.29 వేలు, ఎరువులు, అంతర్ పంటల సాగు నిర్వహణ కోసం నాలుగేళ్లకు గాను హెక్టారుకు రూ.12 వేలు అందిస్తారన్నారు. డ్రిప్ పరికరాల కోసం 70 నుంచి 90 శాతం వరకు రాయితీ అందిస్తామని, మొక్కలు నాటిన నాలుగేళ్ల నుంచి 30 ఏళ్ల వరకు నిరంతర ఆదాయం లభిస్తుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే నేరుగా ఫలసాయాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ జీఎం కొండారెడ్డి మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని బి.మఠం, మైదుకూరు, ప్రొద్దుటూరు, కాశినాయన, పులివెందుల మండలాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి జయభరత్‌రెడ్డి

సీమకు ఎత్తిపోతల నీళ్లిస్తామనడం హాస్యాస్పదం

ప్రొద్దుటూరు క్రైం : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను రాయలసీమకు అందిస్తామని చెప్పడం అర్థరహితమని రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు మహమూద్, పద్మ, వరలక్ష్మి, ఇస్మాయిల్, దర్బాన్‌బాషా, హమీద్ తదితరులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలానికి నీళ్లు ఎత్తిపోయాల్సిన అవసరం ఏముందని వారు ప్రశ్నించారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచే సాగర్‌కు నీళ్లు వస్తున్నప్పుడు వాటిని నిలుపుదల చేస్తే సరిపోతుందని తెలిపారు. నీరు కిందికి పోయాక మళ్లీ ఎత్తి పైకి పోస్తామనడం ఏమిటని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబుకు రాయలసీమపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికే గోదావరి నీళ్లు పట్టిసీమ ద్వారా ఆదా అవుతున్నాయని, ఆ నీళ్లను రాయలసీమకు కేటాయిస్తూ ఎందుకు జీఓ ఇవ్వకూడదని ప్రశ్నించారు. చంద్రబాబు చేస్తున్న ఈ ప్రతిపాదనను రాయలసీమ విద్యావంతుల వేదిక తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. 'మాకు కేటాయించిన నీళ్లను మేమే నిల్వ ఉంచుకునేలా ఇక్కడి రిజర్వాయర్లను మొదట రిపేరు చేయండి' అని పేర్కొన్నారు. ఒక వైపు కడప జిల్లాలో అన్నమయ్య రిజర్వాయర్ పూర్తిగా కొట్టుకుపోగా మరో వైపు కర్నూలు జిల్లాలో అలగనూరు రిజర్వాయర్ పనికి రాకుండా పోయిందని తెలిపారు. మిగతా రిజర్వాయర్లు పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ ఉంచుకునే పరిస్థితి లేదన్నారు. వాటికి మరమ్మతులు చేసి ప్రకృతి సహజంగా వస్తున్న నీళ్లనైనా రాయలసీమకు వినియోగించుకునేలా చూడాలని పేర్కొన్నారు. అంతేగానీ రకరకాల మాయమాటలతో మళ్లీ సీమ ప్రజలను మోసగించవద్దని తెలిపారు.

వైభవంగా నాగుల చవితి





ప్రొద్దుటూరులోని శివాలయంలో నాగులకట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు, రాజుపాళెంలో పుట్టకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు కల్చరల్ : నాగుల చవితిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని పలు పుట్టలు, ఆలయాల్లోని నాగుల కట్ట వద్ద సందడి నెలకొంది. ఉదయం నుంచి భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. తమను కాపాడాలని కోరుతూ పుట్టల్లో పాలు పోసి చలివిడి, నువ్వుల ఉండలను నైవేద్యంగా సమర్పించి కొబ్బరి కాయలు కొట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని పుట్టవీధిలో భక్తులు పుట్టవద్ద పూజలు చేసేందుకు తెల్లవారుజామునే చేరుకున్నారు. స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని నాగుల కట్ట వద్ద భక్తులు పెద్ద ఎత్తున చేరుకుని నాగదేవతా విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి కర్పూర హారతులు ఇచ్చారు. దేవతా విగ్రహాల చుట్టూ ప్రదక్షణలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి పుట్టలు, విగ్రహాల వద్ద పూజలు చేసి రక్షాదారం కట్టుకున్నారు. ముక్తిరామలింగేశ్వరాలయం, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు పలు ఆలయాలలోని నాగదేవతా విగ్రహాలకు, గంగమ్మ ఆలయం వద్ద పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు.

రాజుపాళెం : మండలంలోని పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నాగులచవితిని పండుగను జరుపుకొన్నారు. మహిళలు ఉదయాన్నే స్నానాలు చేసి పుట్ట చుట్టూ తిరిగి ఒక్కపొద్దు ఉన్నట్లు చెప్పి వచ్చారు. ఆ తర్వాత మళ్లీ వెళ్లి పుట్టలో నువ్వులు, చలువ పిండి, బెల్లం, పసుపు దారం, పాలతో ప్రత్యేకంగా పూజించారు. నాగులచవితి రోజు పుట్టకు ఉపవాసం ఉండటం వల్ల నాగ, సకల దోషాలు తొలగి, కోరుకున్న కోర్కెలు నెరవేరతాయని భక్తుల విశ్వాసం. ఉపవాసం ఉన్న వారు మరుసటిరోజు ఉదయం పుట్టకు పాలు పోసి ఉపవాస దీక్షను విరమించనున్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

కలసపాడు : వరి పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రైతుశిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి ఎం.శివశైలజ, మండల వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ తెలిపారు. గురువారం మండలంలోని మహానందిపల్లె రైతుభరోసా కేంద్రం వద్ద రైతులకు గ్రామ విత్తనోత్పత్తి పథకం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరిపంటలో కాలిబాటలు తీయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని, అలాగే వరినారు కొనలు తుంచి నాటడం వల్ల ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. వరినారు శుద్ధిచేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు అశోక్‌కుమార్‌రెడ్డి, నాగరత్నమ్మ, శివ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వాణి, సుహాసిని, రైతులు పాల్గొన్నారు.



రైతు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్

డెంగీ నివారణకు ముందస్తు చర్యలు

బి.కోడూరు : మండలంలోని ఐత్రంపేట సచివాలయం పరిధి క్రిష్టాపురం గ్రామంలో డెంగీ కేసు నమోదు కావడంతో ముందస్తు జాగ్రత్తగా వైద్యాధికారులు అన్ని గృహాల్లో లార్వా సర్వే, ఫీవర్ సర్వేను పోరుమామిళ్ళ సబ్‌యూనిట్ అధికారి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు దోమల ద్వారా వచ్చే వ్యాధులు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమల లార్వా నియంత్రణ, దోమల నియంత్రణ పద్ధతులపై వివరించారు. వైద్యాధికారి వినీత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ ఈ సీజన్‌లో ప్రజలు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. జ్వరం సోకిన వెంటనే ప్రభుత్వాసుపత్రికి వచ్చి వైద్యపరీక్షలు చేయించుకుని, మందులను పొందాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ హరీష్‌రెడ్డి, ఏఎన్ఎం మల్లిక, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఆశా కార్యకర్త జ్యోతి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



దోమల నియంత్రణ మందును పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది